# తాయం

**కు**ల్లాయప్ప జీవితంలో మొన్నా, అప్పుడూ, నిన్నా, ఇప్పుడూ జరిగిన వాటికీ, జరుగుతూ వున్నవాటికీ, బీరకాయపీచు సంబంధమేదో వుండి వుంటుంది. లేకపోతే ఇదంతా జరగవచ్చునని కల్పిస్తూ నమ్మబలకటం కష్టం. అదేకష్టమైతే కుల్లాయప్ప కథకు కూడా కాళ్లు లేవు. ముంతకు చెవులెట్లాగూ వుండవు.

మొన్న...

బలహీన వర్గాలు, పేదల సంక్షేమ కార్యక్రమం ప్రచారంలో భాగంగా బైరాగి పట్టెడలో ఇండ్ల స్థలాల పంపిణీ సభ ఏర్పాటైంది. ఆ సభలో మరొక యాభై ఏడుమందితో పాటు కుల్లాయప్పకు కూడా నాలుగు సెంట్ల ఇండ్లస్థలాన్ని మంజూరు చేసే ఉత్తరువు అందింది. రాష్ట్ర సంక్షేమశాఖ మంత్రే స్వయంగా అందరికీ సదరు ఉత్తరువులను జైజైల మధ్య దానం చేశాడు. మూడేండ్లుగా తిరిగిన తిరుగుళ్లూ, బతిమాలి బామాలడాలూ, వాళ్ళకూ, వీళ్ళకూ చెల్లించుకున్న ముడుపులూ, చేసిన తోమాల సేవలూ,కంచి గరుడ సేవలూ, దర్గాల్లో చదివింపులూ, దేవుళ్ల మొక్కుబడులూ ఆ సందర్భంలో కుల్లాయప్పకు జ్ఞాపకం రాకపోలేదు. అయినా తనకంటూ సొంత ఆస్తి ఒకటి ఏర్పడినట్లు సంతోషపడ్డాడు. అర్వై ఏళ్లు పైబడిన వయసులో వచ్చిపడబోతున్న స్థిరాస్తి అది. పైగా ముప్పయేళ్లతర్వాత తిరుపతిలో ఏర్పడబోతున్న సొంత నేల అది. అందుకే బాధ లేవేం అనుభవించినా, కొంత సంతోషంతో రగలని మంటతో సగం చేయెత్తి నలుగురిలోనూ 'జై' అని గొంతు కలిపాడు.

అప్పుడు...

ముప్పయి ఏళ్ళ కిందట కుల్లాయప్పకు కొత్తపల్లె గరుగుల్లో అయిదెకరాల భూమి

వుండేది. కాసిన్ని జొన్నలో, కొర్రలో పండే ఆ భూమితోపాటూ రెండంకణాల మిద్దె కూడా వుండేది. వీటితో పాటు పిత్రార్జితంగా వచ్చిన ఇతర ఆస్తిపాస్తులన్నీ తమ కులవృత్తికి సంబంధించినవి: రెండు కమాన్లూ, నాలుగు గూటాలూ, రెండో మూడో ఏకు బద్దలూ, మూడు ఏకుల బుట్టలూ, ఒక రాట్నమూ, దూది ఏకి , పరుపులు కుట్టే పనితో సంబంధముండే మరికొన్ని చిల్లర మల్లర పనిముట్లూ అవి. ఒక ఏకనాదం కూడా కుల్లాయప్ప ఇంట్లోవుండేది. అది వాళ్ల అబ్బది - నాయన నాయనది. బ్రహ్మంగారంతటి గురువు, సిద్ధప్ప వంటి శిష్యుడు, వేమన వంటి యోగి లేడని విన్న కుల్లాయప్ప అబ్బ సిద్ధప్ప కీర్తనలను ఏకనాదం మీద పాడి ఆనందించేవాడు. అబ్బ యిచ్చిన ఆ ఏకనాదం ఇంట్లో వుంటే, చిన్నప్పుడు నేర్చిన ఒకటి రెండు సిద్ధప్ప వచనాలు కుల్లాయప్ప బుర్రలో వుండేవి. కుల్లాయప్ప నాన్నకు దూది ఏకేటప్పుడు కమాను నరం నుంచీ వచ్చే ధ్వనులకంటే మించిన సంగీతం లేదు. కుల్లాయప్పకూ అంతే. పైగా రాసే చదువుమీద గురి కుదరలేదు.

1942లో మద్రాసు మెయిలును బలవంతంగా ఆపి, దాడి చేసి టపాలు కొట్టిన జాతీయోద్యమకారుల బృందంలో కుల్లాయప్ప ఒకడు. అప్పటికి పదిహేడేండ్ల వయసు. ఆ సంఘటనలో కుల్లాయప్ప ప్రదర్శించిన సాహసాన్నీ, నీతినీ నాయకులు మెచ్చుకున్నారు. వాళ్ల మాట ప్రకారమే, ముూన్నెల్లు బ్రహ్మంగారి మఠంలోనూ, ఆ చుట్టుపక్కల పల్లెల్లోనూ కుల్లాయప్ప దాక్కున్నాడు. కేసు మీద పడలేదు. అల్లీపురం జైలు తప్పింది కానీ,తండ్రి మెడలు వంచి, కదిరి పక్క తవణం పల్లె పిల్ల సిద్ధమ్మను తెచ్చి కుల్లాయప్పకు ముడివేశాడు. పదారేళ్ల సిద్ధమ్మ తనతోపాటు బొంతలు కుట్టే కళను ఆస్తిగా, సంపదగా మెట్టినింటికి తెచ్చింది. నాయకులు జైళ్లకు వెళ్లడం వల్లనైతేనేమి, ఇతరుల సొంత సుఖాల వల్లా, బాధలవల్లా నైతేనేమి ఉద్యమానికి ఆ ప్రాంతాల్లో అప్పటి ఊపు తగ్గింది. దీనికి తోడు కుల్లాయప్పకు భార్య అంటే ఎంతో ఇష్టం. ఇది కనిపెట్టి కుల్లాయప్పకు తండ్రి అదీ ఇదీ చెప్పి, పక్కపల్లె రెడ్డేరింట్లో సేద్యగాడుగా చేర్పించాడు. అప్పటికే రైతుల ఇళ్లల్లో రాట్నాలు మూలపడుతున్నాయి; ఏడాది పొడుగునా దూదేకి పరుపులు కుట్టేపని సన్నగిల్లింది; మిగిలిన పనికి తాను, తన కోడలు చాలు; కుల వృత్తిని పూర్తిగా విడవకుండా కొడుకు సేద్యగాడు కావడమే మంచిది; అయిదెకరాల గరుగు సేద్యానికి రైతు ఎద్దుల్నో బండినో, బరకట్లనో ఇవ్వకపోడు - ఈ రకంగా తండ్రి ఆలోచించాడు. కుల్లాయప్ప భార్యను చూసి ఒప్పుకున్నాడు. కూడూ గుడ్డా ఏదో గడిచిపోతున్నాయి. స్వాతంత్ర్యం వచ్చాక కూడా, ముద్దనూరు దగ్గర టపాలు కొట్టిన రాత్రి సాహసం కుల్లాయప్పకు ఒక జ్ఞాపకంగా మాత్రమే మిగిలిపోయింది. తర్వాత తర్వాత ఏ ఫలితాలూ దక్కని అనుభవంగా మాత్రమే అది ఉండిపోయింది.

గంజి కరువు మొదలైంది. రైతులంతా సేద్యాన్ని దాదాపు ఎగ గట్టారు. కుల్లాయప్ప సేద్యగాని పని ఊడిపోలేదు. మునుపట్లోలాగా రెడ్డేరు గింజా గట్రా కుల్లాయప్పకు ఇవ్వటం మానివేశారు. ఈ రోజుల్లో సిద్ధమ్మను బొంతలు కుట్టమని పిలిచేవాళ్లు కరువయ్యారు. సిద్ధమ్మ కరువు రోడ్డు పనులకు వెళ్లటం చూసి కుల్లాయప్ప మొదట్లో కొంచెం బాధపడ్డాడు. సిద్ధమ్మ అందుకు దిగులుపడలేదు. గానీ, ఆ గడ్డు రోజుల్లో మరొకందుకు తెగ చింతపడింది, తన కడుపు పండలేదనీ, గొడ్రాలు అవుతానేమోననీ. అక్కడికీ మామ అన్నాడు ఒకటి రెండు సార్లు, "ఈ ముదనష్టపు రోజుల్లో బిడ్డలేందే?" అని. ముసలాడన్నట్లు ఆ రోజుల్లో బిడ్డ కలగలేదు. కానీ, ఆ రోజులకే క్షయ ముదిరి సరైన తిండీ తిప్పలూ లేక ఆ ముసలాడు చనిపోయాడు. అప్పుడూ, ఆ తర్వాతా చేసిన బాకీలకు అయిదెకరాలు ఊడ్చుకొనిపోయింది.

ఇల్లు అయకంలోకి పోయింది. కుల్లాయప్ప కూడా రోడ్డు పనులకు మారాడు. రెండు మైళ్ల కరువు మట్టి రోడ్డు పని అయిపోవచ్చింది.

ఈ రోజుల్లో సిద్దమ్మను పెంచి పెద్ద చేసి పెండ్లి చేసిన వాళ్ల పెదనాయన చుట్టపు చూపుగా వచ్చాడు. నిజానికి ఏ గింజో గిట్రో బదులు తీసుకొని పోవచ్చునని వచ్చాడు. పరిస్థితులు చూసి, నోరు రాక అడగలేకపోయాడు. వారం రోజులు తిండి గడిచిపోయింది. అంతమాత్రం మేలు. తిరిగి వెళ్లేముందు బాధ నాపుకోలేక కూతుర్నీ, అల్లుణ్ణీ కూర్చో బెట్టుకొని చెప్పాడు :

"ఒకటి రెండిల్లోల్లు, మనోల్లం తిరపతి పక్కకు పోదామనుకున్నాం. మీరూ రారాదా?'

అక్కడితో ఆగకుండా, కదిరి చుట్టుపట్ల పల్లెల్లోని మనుషుల గోడును తెలిపాడు. "దాదేరాకు తిని బతికే అవస్తలొచ్చినా"యని కళ్లనీళ్ళు పెట్టుకొని వాపోయాడు. గంజి కేంద్రాల సంగతి చెప్పాడు.

కుల్లాయప్ప, సిద్దమ్మలకు భవిష్యత్తు అనేది మరింత అయోమయంగా, భీతావహంగా కన్పించింది. ఆ సందర్భంలోనే, పిల్లో పిల్లాడో కలిగితే తిరపతి కొస్తామని ఎప్పుడో మొక్కుకున్న సంగతి కుల్లాయప్పకు గుర్తుకొచ్చింది. కరువుకు ముందు వెళ్ళి వచ్చిన బ్రహ్మంగారి మఠం, ముడుమాల, సిద్దమ్మకు మనుసులో మెదిలి,ఆ పక్కన్నే తిరుపతి వచ్చి చోటు చేసుకుంది "సర్లే" అన్నారిద్దరూ, కూడబల్లుకొన్నట్లు.

రోడ్డు మేస్త్రీ హుస్సేన్‌రెడ్డికి ఆయకంలో వున్న ఇంటిని కుల్లాయప్ప అమ్మివేశాడు. అప్పుపోను నాలుగునూర్లు చేతికొచ్చింది. ఎందుకైనా మంచిదని కులవృత్తికి సంబంధించిన సాధనాలు తీసుకొని బోకీ బోలే తప్పేలాలూ మూటకట్టుకొని కుల్లాయప్పా, సిద్దమ్మా వలస పోవటానికి సిద్దపడ్డారు. కదిరి బంధువులు కొందరు మూటాముల్లెతో వచ్చి ముద్దనూరు రైలు స్టేషన్లో కలుసుకున్నారు. వాళ్లు ప్రయాణం చేసిన గుత్తి-రేణిగుంట లోకల్ ట్రెయిన్లో సగానికి పైగా ప్రయాణీకులు వలస వెళ్ళుతున్న వాళ్ళే. రేణిగుంటలో దిగి, ఏదో వ్యానులో పడి తిరుపతి చేరుకున్నారు.

ఎవరో చెప్పగా విని బాగుందనుకుంటూ, కుల్లాయప్పా, సిద్దమ్మా తిరుపతి పడమర స్టేషన్ చేరుకున్నారు. ప్లాట్‌ఫారం మీద వంటలు చేసుకుంటూ, వెయిటింగ్ రూంలో తమలాంటి వాళ్ళతోపాటు పడుకుంటూ, కులవృత్తితోపాటూ ఆ పనీ ఈ పనీ చేసుకుంటూ అక్కడే మూడు నెలలు గడిపారు. ఈ లోగా ప్రెసిడెంటూ, పంచాయితీ ఆఫీసరూ దయతలచి తమ అదుపులోని పోరంబోకులో గుడిసె వేసుకోనిచ్చారు. గుడిసె వేసుకునే ముందూ, వేసుకున్న తర్వాత ప్రెసిడెంట్ ఇంట్లో-కుల్లాయప్ప కనీసం ఏడాది కొక మారైనా పరుపులు, దిండ్లు ఉద్దరగా కుట్టి యిచ్చాడు. సిద్దమ్మ పాచి పనిని చాలా తక్కువ జీతానికే చేసింది. పంచాయితీ ఆఫీసరు నలుగురాడపిల్లల పురుళ్లకు-పైసా తీసుకోకుండా- కనీసం ఇరవై బొంతలను సిద్దమ్మ కుట్టి యిచ్చింది. ఋణ ముంచుకోకూడదని కుల్లాయప్ప, సిద్దమ్మ అనుకుంటూ చేతనైన సేవలు చేశారు.

ప్రెసిడెంటూ, పంచాయితీ ఆఫీసరూ దేవుళ్లు పూజలందుకున్నట్లు వాళ్ల పూజల్ని అందుకున్నారు. ప్రెసిడెంటు తమ్ముడే మునసబు కాబట్టి ప్రెసిడెంటుకు అందిన సేవలన్నీ రామాలయంలో లక్ష్మణునికి కూడా అందినట్లు అందాయి. ఒక్క రెవెన్యూ ఇన్‌స్పెక్టర్‌కు మాత్రం పదీ పరాకా ఇవ్వవలసి వచ్చింది. ఈ ముచ్చట అయిదారేండ్లు పెద్ద సమస్య లేకుండానే సాగింది. ఇండ్ల స్థలాలు కొనుగోళ్లు, అమ్మకాలు, స్పెక్యులేషన్, పట్టాలు

పుట్టించుకోవటాలు, పోరంబోకు ఆక్రమణలు, వ్యాజ్యాలు మొదలై జోరందుకోవటంతో కుల్లాయప్ప పోరంబోకులో తాను కట్టుకొన్న గుడిసెను వదిలి అద్దె గుడిసెలోకి మారవలసి వచ్చింది.

తిరుపతికి వచ్చాక రెండు సంవత్సరాల తర్వాత సిద్దమ్మ ఒక ఆడపిల్లను కనింది. మరో ఆరేళ్లలో ముగ్గురు మగపిల్లలు కలిగి, ఇద్దరు మిగిలారు. మూడోవాడు అద్దె గుడిసెలోనే పుట్టాడు. ముగ్గురు పిల్లలకు కాస్తా వయసు వచ్చేసరికి, పసి మనుషుల అవసరం కూడా పెరుగుతూ వచ్చింది. పాచిపనులు, ఇళ్ల పనులు, మరేవో చిల్లర పనులు ముగ్గురూ చిన్న వయసు నుంచే చేస్తూ వచ్చారు. పెద్దది-ఆడపిల్ల కుల్లాయమ్మ-పెద్దమనిషి అయిందో లేదో, ఆ పిల్లను రేణిగుంట కాటన్ మిల్లులో పని చేస్తున్న పిల్లోడు -కదిరి పక్క బంధువే- చెప్పా చెయ్యకుండా పెళ్లాడాడు. కూతురు రేణిగుంట చేరింది. కుల్లాయప్ప పెద్ద కొడుకు దస్తగిరి పదిహేనేళ్ల వయసులో ఇంట్లోంచి పారిపోయాడు. కడగొట్టు వాడైన వన్నూరప్పకు ఇప్పుడు ఇరవైమూడేండ్లు, తిరుపతి కాటన్ మిల్లులో నాలుగేండ్లుగా పని చేస్తున్నాడు. ఇంకా పెళ్లి కాలేదు.

వన్నూరప్ప కాటన్ మిల్లులో చేరిన ఏడాదికో, ఏమో ఒక సంఘటన జరిగింది. యూనివర్శిటీ క్వార్టర్స్‌లోని ఒక ప్రొఫెసరింట్లో, పాత పరుపుల్లోని దూది ఏకి, కొత్తవాటిని కుల్లాయప్ప కుట్టవలసి వచ్చింది. ఆ రోజు ఆదివారం కాబట్టి ప్రొఫెసర్ ఇంట్లోనే వున్నాడు. గిడసగా, బక్కపలచగా, వయసెంతో వెంటనే ఊహించలేని కాయశరీరమున్న కుల్లాయప్ప పనిని ప్రొఫెసర్ నిశితంగా తన ప్రొఫెసర్ బుద్ధితో పరిశీలించాడు. కుల్లాయప్ప తన పనిలో చూపిన శ్రద్ధనూ, నిజాయితీనీ చూసి ఆ మానవుడు చలించిపోయాడు; కుల్లాయప్ప జీవిత వివరాలడిగాడు. కుల్లాయప్ప అన్నీ చెప్పి, మధ్యలో జాతీయోద్యమ కాలంలో తన పాత్ర గురించి కూడా తెల్పాడు-అతి మామూలు మాటల్లో.

"ఇన్నేళ్లుగా తిరుపతిలోనే ఉంటున్నా కనీసం నాలుగు సెంట్ల ఇంటి స్థలమైనా లేదా?'" అని ప్రొఫెసర్ ఆశ్చర్యపోయాడు; "ఉంటే స్వంత గుడిసెవేసుకోవచ్చు. అదే కొన్నాళ్ళకు మంచిఆస్తి అవుతుంది" అన్నాడు. బలహీన వర్గాల వాళ్ళకూ, పేదలకూ ప్రభుత్వం ఉచితంగా పంచిపెట్టే ఇళ్ల స్థలాల గురించి, ఇళ్లు కట్టుకోడానికి దొరికే సబ్సిడీల గురించీ, ఋణాల గురించీ తనకు తెలిసిందంతా చెప్పాడు. చెప్పడమే కాకుండా కొత్తగా వచ్చిన తాసిల్దారు తమ బంధువని చెప్పాడు. తానొక మాట చెపితే సహాయపడతాడన్నాడు. సరిగ్గా ఈ సంఘటనతో కుల్లాయప్ప నివేశన దాహం మొదలైంది; కష్టాలు ఒకటొకటిగా ముంచుకొచ్చాయి.

ప్రొఫెసర్ తమ బంధువైన తాసీల్దారుకు అన్నట్లుగానే ఆ ఒక మాట చెప్పాడు. అప్పటి నుంచి కుల్లాయప్ప మగ్గంలో ఆసు తిరిగినట్లు అక్కడికీ ఇక్కడికీ తిరిగాడు; రాట్నం తిరిగినట్లు గుండ్రంగా తిరిగాడు. సంబంధిత అధికారులు కుల్లాయప్ప దగ్గర పిండగలిగినంత పిండారు. అనధికారుడైన సర్పంచి మాత్రం తమ కుటుంబానికి కుల్లాయప్పా, సిద్ధమ్మా చేస్తూ వచ్చిన సేవలను గుర్తించి సిఫారసైతే చేశాడు. ఈ నివేశన యజ్ఞంలో కమాను మూలబడింది. కుల్లాయప్ప మరి ఏ ఇతర పనీ ముట్టుకోలేకపోయాడు. తండ్రి ప్రయత్నాలకు వన్నూరప్ప అడ్డు చెప్పలేకపోయాడు. ఓవర్‌టైం చేసీ, అప్పు తెచ్చీ తండ్రికి ఆ దశలో చేదోడు వాదోడుగా నిలిచాడు. ఆఖరుకు మొన్న "గ్రామములందు ఇంటి నివేశనములకు మంజారు చేయు ఉత్తరువు యొక్క నమూనా" అరఠావు కాగితం మంత్రి ద్వారా కుల్లాయప్ప చేతుల్లోకి

వచ్చి పడింది.

నిన్న...

వన్నూరప్ప ఆ ఉత్తరువును చూసి సంతోష పడలేకపోలేదు. ఏమేం అనుమానా లొచ్చాయోగానీ, వాటిని తండ్రితో చెప్పకుండా "ఇండ్లేసుకోగలమా?" అని మాత్రం అడిగాడు. ఆ గొంతులో నిరుత్సాహం పలక్కపోలేదు.

దూది ఏకే ముందు నరానికి అంటుకున్న మకిలిని పోగొట్టటానికీ, బిగువు చూసుకోటానికీ కమాను నరాన్ని గూటంతో ఠంగుఠంగుమనేట్లు లాగి తొలగించినట్లు కొడుకుకు కుల్లాయప్ప బదులిచ్చాడు:

"ఎందుకేసుకోలేమేం? అందుకే అంతమంది కాళ్లు కడుపులు పట్టుకున్నింది. ఆ ఒకటిన్నర కాలు పంచాయతాఫీసరు అడ్డుపడినాడనుకో. ఏం జరిగింది? ఆర్డరు వచ్చిందా? లేదా? ఆర్నెల్లల్లో పక్కా గుడిసె లేస్తాది. అందుకే కావడి ఎత్తుతాండా".

"కావడి ఎత్తడమెందుకు? మల్లా అదొక దండగ", వన్నూరప్ప గొణిగాడు.

"అట్లా అనద్దురా వన్నూరూ! నెల కిందట ఆ నాగూరు వలీని చూసొచ్చినాకే గదా ఈ కాగితం చేతి కొచ్చింది? మనం సిద్ధయ్య మతస్తులం. మనకు దర్గా లొక్కటే, దేవలా లొక్కటే; ఫకీర్లొక్కటే, దేవుళ్లొక్కటే. కావడి ఎత్తి తిరుత్తణి పోతే, ఇప్పుడనుకున్నది ఆర్నెలల్లో జరుగుతుంది."

తండ్రిధోరణికి వన్నూరప్పకు ముందెప్పడూ రానంత కోపం వచ్చింది. తమాయించుకోలేకపోయాడు:

"రేపొద్దున నల్లగుడ్డలు వేసుకొని తిరుముడి నెత్తిన బెట్టుకొని అయ్యప్ప కొండకు పోతానంటావు, నీదేం బొయ్యింది? ఈ మొక్కుల్తోనే ఇంటి స్థలం వచ్చి పడిందని నిజంగా నమ్ముతాండావా? అంత మంది కడుపులూ.. కాళ్లూ పట్టుకున్నావే? ఊరికే ఇవ్వలేదే? చెమట గక్కి సంపాయించిన రెండు వేలు ఆ అంతమందిలో సానా మందికి పంచినావే?..."

వన్నూరప్ప కడుపులోది ఇంకా కక్కబోతుంటే, తల్లి సిద్దమ్మ వారిస్తూ అంది-

"ఇదంతా మా కోసరమారా, వన్నూరా? నీ కోసరం కాదా? మేం ఈ పొద్దు కాక పోతే, రేపు గుంతకు పొయ్యేవాల్లం. మా క్కావాలా ఈ నేలా, గుడిసా?"

ఆ మాటలు వింటూ తల్లివైపు చూసే వేళకు వన్నూరప్ప కోపం దిగింది. కొట్టంలోని ఒక పోటు గుంజ నానుకొని చెదిరిన జుట్టుతో మాసిన బట్టల్లో వున్న తల్లి పడుతున్న బాధలూ, దిగుళ్లతో, గుర్తుకొచ్చి, కుల్లాయప్ప సిగ్గుపడి "సరే మీ ఇష్టం" అన్నాడు. కుల్లాయప్ప కావడి ఎత్తనూ ఎత్తాడు. తిరుత్తణి పోనూ పోయి వచ్చాడు.

వన్నూరప్ప, సిద్దప్ప, వన్నూరప్ప సాటి కార్మిక స్నేహితులు చేతుల కష్టం వల్లా, స్నేహితులిచ్చిన చేబదుళ్లవల్లా బైరాగి పట్టెడలోని నాలుగు సెంట్ల స్థలంలో మూడంకణాలపక్కా గుడిసె లేచింది. గుడిసె కప్పటంలోని నైపుణ్యం పూర్తిగా కుల్లాయప్పదే. ఒకప్పుడు వాములు వేయటంలోని పనితనం కుల్లాయప్ప మరచిపోలేదు. అతని లోని ఆ పనితనాన్ని చూసి వన్నూరప్ప, అతని మిత్రులు ఆశ్చర్యపోయారు. అంతేకాదు; గుడిసె చుట్టూ నాటిన ఆకు కూరల్నీ, సర్కారు తుమ్మకంప వాసాలు నాటి అల్లించిన సొరతీగెల్నీ, బీరతీగల్నీ చూసి వాళ్లు దిమ్మతిరిగిపోయారు. సేద్యగాడుగా ఉన్నప్పుడు రెడ్డేరి తోటలో చేసిన పని అనుభవానికి సొంత పెరట్లో, ఇంటి పక్కల్లో సార్థక్యం లభిస్తోంది అని వన్నూరప్ప, అతని స్నేహితులూ

గ్రహించలేకపోయారు.

చూసిన వాళ్లందరూ కుల్లాయప్ప అదృష్టాన్నీ, ఆ ఇంటినీ మెచ్చుకున్నారు. మెచ్చుకోలేకపోయింది కరవాళ్ల వెంకటేశ్వర్లు, కుల్లాయప్ప పొరుగులోనూ, చుట్టుపక్కలా కరవాళ్ల వెంకటేశ్వర్లు రక్తబంధువుల ఇళ్లస్థలాలున్నాయి.

కరవాళ్ల వెంకటేశ్వర్లు ఒక రోజు కుల్లాయప్పను చర్చి రోడ్డులో పట్టుకొని అవీ ఇవీ మాట్లాడి, అసలు విషయానికి వచ్చాడు:

"చూడు కుల్లాయప్పా! చాలా రోజులనుంచి జరిగిన పొరపాటొకదాన్ని నీకు చేప్దామనే అనుకుంటుండా.కలిసి రాలే. నా చెల్లెలి పేర్న రావల్సిన ఇంటి స్థలం ఆర్డరు పొరపాట్న నీ పేర్న వచ్చింది. ఆఫీసుల్లో కనుకున్నా. నీ పేరైతే రికార్డుల్లో ఉందట! బైరాగి పట్టెడలో కాదంట? రాయలచెరువు రోడ్డులో నాలుగైదు మైళ్ల కవతల ఎక్కడో సెకండ్ ఫేజులో నీకు స్థలం ఇచ్చేది ఉందంట! నేనుగవర్నమెంటు ఆఫీసు క్లర్కును గదా. అన్నీ తెలుసుకునే చెప్తున్నా. నువ్విప్పుడున్న నేలను మా కొదిలిపెడితే మంచిది. పైగా మా వాళ్ల ఇండ్ల పట్టాలన్నీ చుట్టూ వున్నాయి. గుడిసె కయిన ఖర్చంటావా? అది ఏదో రకంగా పైసలు చేసుకోవచ్చు. ఆ తర్వాత నీ ఇష్టం..."

కరవాళ్ల వెంకటేశ్వర్లు మాటలు విని కుల్లాయప్పకు మతిపోయింది. కాళ్లు కూడా వణికాయి. కరవాళ్లోడి చరిత్ర కుల్లాయప్పకు తెలియందికాదు. ఈ విషయాన్ని కొడుకు దగ్గర దాచాడు. 'మీది కొచ్చినప్పుడు చూద్దాంలే అడవిలో కాదుకదా వుండేది' అనుకున్నాడు.

కుల్లాయప్పను కరవాళ్ల వెంకటేశ్వర్లు కలిశాక ఎనిమిదో రోజో, తొమ్మిదో రోజో కుల్లాయప్ప రేణిగుంటకు వెళ్ళాడు. కడుపుతో వున్న కూతుర్నీ, మనవళ్లిద్దరినీ వెంటబెట్టుకొని ఆ ఉదయాన్నే ఇంటి కొచ్చాడు. సిద్దమ్మ వగర్చుకుంటూ మొగుణ్ణి గుడిసె వెనక్కు లాక్కుపోయింది. కడుపుతో ఉన్న తననూ, తన పిల్లలనూ మాట మాత్రం పలకరించకుండా, ఆత్రంగా నాయనను లాక్కుపోయిన అమ్మను చూసి కుల్లాయమ్మ నొచ్చుకుంది. ఏం జరిగిందీ, ఏమోనని తనూ అక్కడికి వెళ్లింది.

దొడ్లో ఒక మూల, గొంతుకు ఎర్రదారం బిగించిన జానెడు గుడ్డ బొమ్మా, మూడు అడ్డంగా కోసి విసిరేసిన నిమ్మకాయలూ, కుంకుమా, ఎర్రమట్టి నీళ్ల మట్లూ వున్నాయి.

వాటిని మాటిమాటికీ చూపిస్తూ రొమ్ముల మీద బాదుకుంటూ సిద్దమ్మ బోరున ఏడ్చేసింది.

"నాయనో! సేతబడి సేసినార్రో. నా మొగుడూ, పిల్లలూ గుల్లయిపోతే నా గతేంరో నాయనో? కుల్లాయమ్మా! నువ్వూ సూడే. ఏ పాపిస్టోల్లో మన మీద పగబట్టిన్నా రర్రో..."

కుల్లాయప్పకు నోట మాట రాలేదు. ఆమె బెదిరిపోయి తన పిల్లలిద్దర్నీ గట్టిగా పొదివి పట్టుకుంది.

"పిల్లోడు సూల్లేదా?" కుల్లాయప్ప గొంతు పెగల్చుకుని గొణుకుతున్నట్లు భార్యతో అన్నాడు.

"తెల్లారు జామునే మిల్లుకు పోయినాడు. సూడలా. ఓరి తండ్రో!" సిద్దమ్మ మళ్లీ ఏడుపు పదం ఎత్తుకుంది.

అది చూసి కుల్లాయమ్మ రాగాలు మొదలుపెట్టింది. ఉన్నట్టుండి "నాయనో! ఈ ఇంట్లో నేనూ, నా పిల్లలూ సస్తేవుండం. పోతాం. మా కష్టం మేం పడతాంలే. నేనూ, నా పిల్లలూ ఇప్పుడే పోతాం నాయనో" అని అంటూ పిల్లల్ని తీసుకొని తమ గుడ్డలు పెట్టుకొని వచ్చిన వైరు బుట్టతీసుకొని బయలుదేరింది.

కుల్లాయప్ప సమాధిలో ఉన్నవాడిలాగా ఉలకలేదు. పలకలేదు. ఎవరో తరిమినట్లు కూతురూ, పిల్లలూ వెళ్ళిపోయారు. ఈలోగా నలుగురూ పోగయ్యారు. సానుభూతి చూపించారు. చేతబడి చేసినారనుకున్న వాళ్లను నానా మాటలన్నారు. భయాలు చెప్పారు. ఒకటి రెండు కథలు చెప్పారు. ఉపాయాలు చెప్పారు. రకరకాల ఓదార్పుల మధ్య సిద్దమ్మ బెక్కుతూనే ఉంది.పూనకం వచ్చినప్పుడు బిగ్గరగా ఏడ్చేస్తూ "ఎవరికి కన్ను కుట్టిందో మమ్మల్ని చూసి-వాళ్ల చేతులు బడిపోనూ!" అని వాపోతూ శపిస్తూనే వుంది.

కుల్లాయప్పకు తలతీసినట్లయింది. ప్రమాద మేదో ముంచుకొచ్చిందని తల్లడిల్లిపోయాడు. ఏం చెయ్యాలోనని తల బద్దలయ్యేట్లు ఆలోచించాడు. ఇంట్లోంచి బయటపడి, రోజంతా వీళ్లదగ్గరా, వాళ్ల దగ్గరా జరిగిన సంఘటనను గురించి బాధతో చెప్పుకున్నాడు. కుల్లాయప్పను పెద్ద మనిషిగా గుర్తించిన కొందరు మనస్ఫూర్తిగా జాలిపడ్డారు. ఒకరిద్దరు ఎందుకూ పొందని వేదాంతం మాట్లాడారు. ఒకాయనేమో "మంచి మాంత్రికుడు పుత్తూరు దగ్గర వున్నా"డన్నాడు.

ప్రొఫెసరు అంతా విని "నాకైతే నమ్మకం లేదు కానీ, ఏమో?" అని సందేహంతో ఆగిపోయాడు. ఏ సహాయమూ చేస్తాననలేదు.

చీకటి పడ్డాక సర్పంచి దొరికాడు. విషయమంతా విని సర్పంచి సలహా యిచ్చాడు:

"గొడవెందుకు? ఆ స్థలం విడిచి పోరాదా? కరవాళ్లోడు లిటిగెంటు ముండా కొడుకు. వాడన్నట్లు ఆ గుడిసె కయిన ఖర్చులేవో తీసుకో. కావాలంటే నా బీడు నేల్లో గుడిసె వేసుకో. ఇప్పట్లో ఆ నేలను అమ్మేదంటూ లేదు. ఈ లోగా ఇంటి స్థలం ఎక్కడో ఒక చోట నీకు రాకపోదు. ఇప్పుడేదన్నా చేస్తామంటే రెడ్లూ, కరణాలూ పోయిరి, ఆ మండలాలు రానీ..."

"మీకు తెల్సు గద, సారూ! నోటికాడ కూడు. మీరు గాని గట్టిగా సెప్తే..." కుల్లాయప్ప దీనంగా సర్పంచి వైపు చూశాడు.

సర్పంచి విసుగుతో చేతులూపుతూ అన్నాడు :

"నీకు తెలీదు. వాడుకులం గొడవలు రేపుతాడు. లేకపోతే నాఇంటి మీదికే ఏదో ఒకటి తెస్తాడు. నన్నీ గొడవలోకి లాగద్దు. ఇంకేం సాయం చెయ్యమన్నా చేతనైంది చేస్తాను".

రాత్రి ఏ పదిగంటలు దాటాకో, కుల్లాయప్ప కాళ్లీడ్చుకుంటూ గుడిసె చేరుకున్నాడు. ఒక గుంజకు ఆనుకొని సిద్దమ్మ నెత్తిన చేతులు పెట్టుకొని కూర్చొని వుంది. నులకమంచం మీద ఆలోచిస్తూ పడుకొని వున్న వన్నూరప్ప తండ్రిని చూస్తూనే లేచి కూర్చున్నాడు. మరొక గుంజకు ఆనుకుని కుల్లాయప్ప కూర్చున్నాడు.

"ముందు కూడు తిను", అని వన్నూరప్ప తండ్రితో అన్నాడు.

సిద్దమ్మ లేచి వడ్డించింది. ఏదో తినటమైంది అనిపించాడు కుల్లాయప్ప. మళ్లీ గుంజకానుకొని కూర్చున్నాడు.

అప్పుడు వన్నూరప్ప నిబ్బరంగా అన్నాడు-

"నాయనా! అవి తీసి వాడి స్థలంలోకి విసిరి కొట్టినా? ఏమైతాది! చేతబడీ లేదు. గీతబడీ లేదు. తిరగబడి అవుతుంది ఆ కరవాళ్ల సువర్‌గాడికి. తమాషా అనుకుంటున్నాడేమో! బలహీనవర్గాలని చెప్పి, వాళ్లనూ వీళ్లనూ అడ్డం పెట్టుకొని మామ పేర్నా, పెండ్లాం పేర్నా, అమ్మ పేర్నా, అక్కా చెల్లెలి పేర్నా, పుట్టనివాళ్ల పేర్నా ఇండ్ల పట్టాలు సంపాయించడ మనుకున్నాడేమో, ఇప్పుడుండే ఆస్తులు గాక? ఇండ్ల స్థలాలకు గిరాకీ పెరుగుతా వుందని మోసానికి దిగుతాడా? ఆ మొన్న దిక్కులేని పుల్లమ్మది గుంజుకున్నాడు. నిన్నగాక మొన్న

గుడ్డి ఏసోబుది కలువుకున్నాడు. ఈ పొద్దు మన మిందికా? అందరూ ఊరుకుంటారనుకున్నాడేమో? నువ్వెందుకు దిగులు పడతావ్? ఏం చేసుకుంటాడో చేసుకోనీ".

కొడుకు మాటల్లోని నిర్భయం గమనించి కుల్లాయప్ప బిత్తరపోయాడు. ముద్దనూరు టపాలు కొన్నిన నాటి తన పట్టుదలా, ఆవేశమూ కుల్లాయప్పకు గుర్తుకొచ్చాయి. 'కనిపించని తెల్లోడి ప్రభుత్వం మీద తిరుగుబాటు చేయడం వేరు, రోజూ కనిపించే కరవాళ్లోడితో తలపడడం వేరు' అనుకున్నాడు. మారు మాటాడకుండా నేల మీదనే పడకేసి 'స్వామి అయ్యప్పా! ఈగండం నుంచి కాపాడు. దీచ్చ తీసుకుంటా" అని మనసులో చాలా సేపు ప్రార్థించి కలత నిద్రలో పడ్డాడు.

మరుసటి రోజు కరవాళ్ల వెంకటేశ్వర్లు తన మీద కుల్లాయప్ప చేతబడి చేయిస్తున్నాడని పెద్ద ప్రచారం చేశాడు. వారం తర్వాత, వన్నూరప్ప మిల్లుకు పోయిన రాత్రి తన చెల్లెలి పేరు మీద కుల్లాయప్ప ఇంటిస్థలం నంబరుతోనే వున్న ఆర్డరునూ, ఏకంగా పట్టానూ పంచాయతీ పెద్దలకు చూపించి "ఇప్పుడు చెప్పండి" అన్నాడు.

కుల్లాయప్పను పంచాయతీకి పిలిపించారు. సర్పంచీ, మునసబుగిరీ పోయిన మునసబూ, మరో ఇద్దరు పంచాయితీ పెద్దలు నోళ్లు వెళ్లబెట్టి "పోనీ ఆ గుడిసెకైన ఖర్చులేవో ఇస్తానన్నాడంట. అవి ఇవ్వు. ఖాళీ చేసి మరొక చోటికి పోతాడు" అన్నారు. 'నేను అనలేదు' అన్నాడు మొండికేసి కరవాళ్ల వెంకటేశ్వర్లు. ఇల్లు ఖాళీ చేసి పోవటానికి పంచాయితీ పెద్దలు ఏదో ఔదార్యం చూపుతున్నట్లు కుల్లాయప్పకు రెండు వారాలు గడు విచ్చారు.

మంత్రి సొంత చేతుల్తో అందరి ముందరా ఇచ్చిన తన ఉత్తరువు సంగతేమిటని కుల్లాయప్ప మొత్తుకున్నాడు.

"పొర్పాట్లుంటాయి" అన్నారు వాళ్లు.

కుల్లాయప్ప ఆ రాత్రంతా కుళ్లి కుళ్ళి ఏడ్చాడు. సిద్దమ్మ తిట్టగలిగిన వాళ్లందరినీ తిట్టి తిట్టి తిండి మానేసి ఒక మూలన ఒరిగింది.

వన్నూరప్పకు మరుసటి రోజు సెలవు. వచ్చాక అమ్మా, నాయనలు చెప్పకపోయినా, జరిగినదంతా వివరంగా మిత్రుల ద్వారా తెలుసుకున్నాడు. ఇంట్లో చెప్పా పెట్టకుండా మాయమయ్యాడు. వారమైంది. ఇంటికి రాలేదు. అప్పుడప్పుడు అదిమామూలే కాబట్టి కుల్లాయప్పా, సిద్దమ్మ కంగారు పడలేదు. మూడు రోజులు రాత్రుళ్లు కుల్లాయప్ప ఇంటికి రాలేదు. సిద్దమ్మ బెంగతో, భయంతో అల్లాడిపోయింది.

శనివారం రాత్రి పదకొండూ పంద్రెండు గంటల మధ్య బాగా తాగి రిక్షాలో పడి కరవాళ్ల వెంకటేశ్వర్లు వస్తున్నాడు. రైల్వే బ్రిడ్జి ముందంచు దగ్గరకు రిక్షా చేరబోతోంది. బ్రిడ్జి మీద నుంచి ఠపఠపా మూడు బాంబులు విసురుగా వచ్చి పడ్డాయి. వెంకటేశ్వర్లు ప్రాణమైతే దక్కింది. కాళ్లు నుజ్జు నుజ్జు అయ్యాయి. అదే రాత్రి సినిమా రెండో ఆట చూసి వస్తున్న పంచాయితీ ఆఫీసరును రాయల చెరువు రోడ్డులో ఎవరో కుళ్లబొడిచి వదలిపెట్టారు.

కరవాళ్ల వెంకటేశ్వర్లు ఆస్పత్రిలో పడ్డాక ఇచ్చిన కంప్లెయింట్ మీద వన్నూరప్పనూ, మిల్లు కూలీల యూనియన్‌లోని మరి ఇద్దర్నీ పోలీసులు అరెస్టు చేశారు. అందరూ బైరాగి పట్టెడలోని వాళ్లే. పంచాయితీ ఆఫీసరు ఎవరి మీదా కేసు పెట్టలేదు.

ఇప్పుడు...

కుల్లాయప్ప రోడ్లంట పిచ్చి పిచ్చిగా తత్వాలు పాడుకుంటూ తిరుగుతుంటాడు. "నే జూచినానే బ్రహ్మము నాలో జూచినానే బ్రహ్మము నాలో జూచినానే" అన్న సిద్ధప్ప వచనం పాడుతూ పాడుతూ పిల్లలు షోగైతే గెంతులు గెంతుతూ "ఆ చేత్తో తాయం, ఈ చేత్తో మాయం" అనే చరణాల్ని అటూ ఇటూ చేతులూపుతూ పునరావృతం చేస్తూనే వుంటుంటాడు. ఎవరైనా నలుగురు చూస్తుంటే ఇకిలిస్తూ - "కరవాళ్లోడి తల విరిచినానె, విరిచినానే-బ్రిడ్జికింద చంపినానే..." అంటుండాడు.

కుల్లాయప్పనూ, కుల్లాయప్ప మాటల్నీ ఎవరూ పట్టించుకోకుండానే ఉంటున్నారు.○

●అక్టోబరు 30, 1991, ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక. ●